మరో అయిదు నిముషాలలో ఊళ్ళోకి కారు ప్రవేశించగానే కారాపించి దూరంగా పోస్టాఫీసు పక్కనున్న పెంకుటిల్లు చూపించింది.

కారుదిగి నానీ ఆ యింటిలో అడుగుపెట్టేసరికి అక్కడ మంచంపై నీరసించిన అమ్మలాంటి ఓ స్త్రీ కనిపించగానే "అంకులింకా రాలేదా?" అన్నాడు.

నిస్త్రాణంగా తల తిప్పిన ఆమెకు అర్థంకాలేదు.

"ఎవరి బాబువి నాన్న? నీ కెవరు కావాలి?" నిస్సత్తువగా అడిగింది.

"నేనేమో మా తాతయ్యున్నాడు కదా.... వాళ్ళ మనవడ్ని " అంతకంటే తన గురించి ఎలా చెప్పాలో నానీకి తెలీలేదు. పైగా తాతయ్యంటే అందరికి తెలిసే వుంటుందన్న నమ్మకం.... "అంకులే మందుకెళ్ళాడు" చెప్పి అరుగుమీద కూర్చుందామని బయటకు రాబోతూ టక్కున ఆగిపోయాడు.

అక్కడ దూరంగా చెట్టుకింద నిలబడ్డ ముగ్గురు వ్యక్తులు నానీనే చూస్తున్నారు.

అది కాదు నానీని కంగారుపెట్టింది.

ఆ ముగ్గురిలో రాజారావు కూడా ఉన్నాడు.

భయంతో ఒక్క ఉదుటున లోపలికొచ్చేసి వణికిపోతు నిలబడ్డాడు.

** ** ** **

కోర్టులో చార్జిషీటు ఫైలు చేసిన యశస్వి ఆరోజే మొత్తం దోషుల్ని చట్టరీత్యా నేరస్తులుగా నిరూపించడానికి చాలా బలమైన పథకం వేశాననుకున్నాడు.

కాని అతడు కోర్టుకి బయలుదేరబోతూండగా చంద్రం స్టేషనుకొచ్చి నానీ కనిపించడం లేదని కంప్లయింట్ ఇవ్వడంతో షాక్ తిన్నాడు.

ఇలాంటి ప్రమాదాన్ని ఊహించే చాలా రహస్యంగా కథ నడిపించాలనుకొన్నాడు. నడిపించాడు కూడా.... కాని యిలాంటి పరిణామానికి దారి తీస్తుందని ఊహించలేకపోయాడు.

ఆవేశాన్ని నిభాయించుకోలేక ఉద్రేకంగా చంద్రం కాలరుని పట్టుకున్నాడు.

రఘునాథరావు రావడం ఒక్క క్షణం అలస్యమైవుంటే చంద్రం దవడా కండరాలు చిట్లిపోయేవి.

"బాస్టర్డ్ - టెల్‌మి- నానీనేం చేశారు" ఉద్వేగంతో చంద్రం మెడ పట్టుకుని కుదిపేశాడు.

"మిస్టర్ యశస్వి" రఘునాథరావు వారించాడు.

"మీరు వెళ్ళొచ్చు" చంద్రాన్ని పంపి "ఇప్పుడేం చేద్దామనుకొంటున్నావు?" యశస్విని చూస్తూ అన్నాడు.

"నానీ మూలంగా ప్రమాదాన్ని ఊహించి వాళ్ళు రహస్యంగా దాచేసైనా వుండాలి, లేదా ప్రాణాలైనా తీసుండాలి" తనను తానే సమాధానపరుచుకోలేక పోతున్నాడు "సర్ -

ఒకవేళ నానీకేమన్నా జరగడమే నిజమైతే వీళ్ళందర్నీ ఉరికంబమెక్కించేవరకూ నేను నిద్రపోను-".

"ఇట్స్ ఓకే మిస్టర్ యశస్వీ.... ఈరోజు కోర్టుకి హాజరు కమ్మని వాళ్ళకి సమన్స్ అందాయిగా - వాట్ విల్ బి యువర్ నెక్స్ట్ స్టెప్"

"సర్" దృఢంగా పలికింది యశస్వి కంఠం "ఐ విట్‌నెస్ లేకపోవడం మూలంగా కేసు పదిరోజులు వాయిదా వేసేట్టు చూడమని ప్రాసిక్యూటర్‌ని రిక్వెస్ట్ చేస్తాను.... ఈలోగా నానీ ఆచూకీ తెలుసుకుంటాను."

"ఓకే.... కేస్ ఎడ్జార్న్ చేయడమన్నది అసంభవం కాదు- కోర్టుకి అటెండై వాయిదా అడుగు-" ఓ క్షణం అగి "అది పూర్తిచేసుకుని వెంటనే వస్తే నీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలి" అన్నాడు టేబుల్ పైనున్న పేపర్ వెయిట్‌ని సాలోచనగా తిప్పుతూ.

"సర్" అనుమానంగా చూశాడు యశస్వి.

"మిస్టర్ యశస్వీ" దీర్ఘంగా నిట్టూర్చారాయన.

"ఒక నిజాయితీగల పోలీసాఫీసరుగా నా కర్తవ్యాన్ని ఖాకీడ్రెస్‌కే కాక దాని వెనకవున్న మనసుకు తీసుకునే నీలాంటి వాళ్ళంటే నాకు చాలా యిష్టం. కాని నువ్వింకా పెద్దగా ఎదురుదెబ్బలు తినడం అలవాటులేని వ్యక్తివి- కాబట్టే ఇంతలా ఆవేశ పడుతున్నావు."

"నాకు అర్థం కావడంలేదు సర్"

"పూర్తిగా కావాలి అంటే ఇంకా నీ అనుభవం చాలదు యశస్వీ. ఎనలైటికల్‌గా ఆలోచిస్తే వాళ్ళు పావనిని హత్య చేశారన్నది నిజం కాబట్టే నానీని మిస్ చేశారు ఇప్పుడు-కేసును తిరగతోడుతున్నావని నీ మీద కక్షగట్టి నిన్ను ట్రాన్స్‌ఫర్ చేయించే ప్రయత్నం చేయగలిగారు".

"సర్" యశస్వి భృకుటి ముడిపడింది.

"అవును యశస్వీ.... బహుశా ఈ రోజు మధ్యాహ్నానికల్లా నీ ట్రాన్స్‌ఫర్ ఆర్డరు నా చేతికందొచ్చు. ఇది వైజాగ్ యస్.పి. ఆఫీసునుంచి నాకు అనధికారికంగా అందిన వార్త"

యశస్వి కసిగా బయటకు కదిలాడు.

** ** ** **

సరిగ్గా అదే సమయంలో....

ఒకసారి అటూ ఇటూ దిక్కులు పరికించి చూసిన రాజారావు ఎవరూ తమను గమనించడం లేదన్న నిర్ధారణకు వచ్చాక తక్కిన ఇద్దరు అనుచరులతో మన్మధరావు ఇంటి ద్వారాన్ని చేరాడు.

"ఎవరు కావాలి?"

ఓ కంఠం వినిపించడంతో గిరుక్కున వెనక్కి తిరిగిన రాజారావు ముందు తొట్రుపడ్డాడు, ఎదురుగా నిలబడ్డ మన్మధరావుని చూసి.

"ఆ... ఆనందరావు కావాలి" అప్పటికి తోచిన ఓ పేరును ఉచ్చరించాడు రాజారావు "అదే.... టీచర్‌గా పని చేస్తుంటాడే!"

"ఇక్కడ అలాంటి పేరుగల వాళ్ళెవరూ లేరు."

"సారీ" అంటూ వెనుదిరిగిన రాజారావు అవకాశం తీసుకుని మన్మధరావుపై కలయబడితేనేం అనుకున్నాడు గాని ధైర్యం చాలలేదు.

ఇది సిటీకాదు జనం ప్రేక్షకుల్లా నిలబడటానికి.

అనవసరమైన రభసతో తన పథకం మొత్తం గంగపాలవుతుంది.

అప్పటికే ఇంట్లోకి ప్రవేశించిన మన్మధరావు నానీని చూసి చాలా ఆశ్చర్యపోయాడు.

నానీని మరో గదిలోకి తీసుకు వెళ్ళాడు.

ఆ ఉద్వేగంలో ఏదో అడిగిన అమ్మ కంఠం సైతం వినిపించలేదు.

జరిగినదంతా చెప్పిన నానీ ఉత్తరాన్ని అందించాడు.

పరీక్ష రాసిన విద్యార్థి పేపరులో నెంబరు చూసుకున్నంత ఆతృత మన్మధరావులో...

"డియర్ మనూ!

'డియర్' అని ఎడ్రస్ చేయటానిక్కూడా ఎందుకంత జంకిపోయావు ఎవరు కాదనగలరు. అలనాటి మన చిలిపి ముచ్చట్లని. నేను ఆట పట్టించినప్పుడల్లా ఉడుకుమోత్తనంగా అలిగే నీ రూపమే గుర్తుకొచ్చింది ఉత్తరం చదివినంత సేపూ.

రచయితగా యింత ఎదిగిపోయిన నువ్వు ప్రాక్టికల్‌గా ఎందుకాలోచించ లేకపోయావో అర్థం కావడం లేదు.

చూడూ నీ ప్రశ్నకి జవాబు చెప్పాలీ అంటే నా అలవాటు ప్రకారం ఆట పట్టించాలిగా.

ఒక చిన్న సమస్య ఇస్తున్నాను. సృజనాత్మకమైన శక్తిగల మేధావివి కాబట్టి దానికి జవాబు చెప్పగలగాలి. కొంచెం కష్టమే కావచ్చు. కాని మరీ అసాధ్యం కాదు.

ప్రాచీన సాహిత్యం మీద నాకు తెగ మనసుందని నీకు తెలుసుగా అందుకే ఓ గంట టైంలో నువ్వు జవాబు తెలుసుకుని మనం తరచూ కలుసుకునే వాళ్ళమే, మన పేర్లున్న మామిడి చెట్టు.... అక్కడికి రావాలి "అగ్రశిఖ" అంటే ఏమిటి?

నీ కోసం సరిగ్గా పదకొండు గంటలకి వెయిట్ చేస్తుంటాను. తెలుసుకోకపోతే రానక్కరలేదు.

-రతి."

పట్టలేని ఆనందం మన్మధరావులో.

ఎప్పుడో చిన్ననాటి జ్ఞాపకాలని ఇంకా పదిలపరుచుకుంటుందిగాని, వాటిని గుర్తు చేసుకుంటూ యీ మాత్రమైనా రెస్పాన్స్ ఇస్తుందనిగాని వూహించి వుండకపోవడంతో అమాంతం నానీని పైకిలేపి ముద్దు పెట్టుకున్నాడు.

వాచీ చూసుకున్నాడు. పదింపావు కావస్తూంది.

అంటే....

రతిని కలుసుకోవడానికి కేవలం నలభై అయిదు నిముషాల గడువు మాత్రమే వుంది.

'డియర్ మనూ' అంటూ రతి సంబోధించిన పద్ధతికి అతడి మనసు ఒక దివ్య హర్మ్యంలో విహరిస్తున్న అనుభూతికి లోనయింది.

మరోసారి ఉత్తరాన్ని చదువుకున్నాడు.

తను వ్య క్తం చేసినంత ఊపు లేదుగాని ఏదో లాలిత్యం వుంది.

"అగ్రశిఖ"

ముందెందుకో దానికి అర్థం వెదకడం అంత కష్టంగా తోచలేదు.

కాకపోతే ఆఖరి వాక్యమే కొద్దిగా చివుక్కు మనిపించింది.

"తెలుసుకోకపోతే రానక్కర్లేదు."

ఇలాగే, సరిగ్గా ఇదే రీతిలో తనకు ఆంక్షలు పెట్టేది బాల్యంలో అసలు తను ఈ మాత్రం ఎదిగాడూ అంటే ఆమె అందించిన ఇలాంటి స్ఫూ ర్తితోనే కదూ!

వేగంగా శబ్దార్థచంద్రికని అందుకుని చూశాడు. అసలా పదమే లేదు. శబ్దరత్నాకరం మొదలుకొని వున్న నిఘంటువులన్నీ తిరగేశాడు. ఫలితం లేకపోవడంతో క్రమంగా టెన్షన్ ఉధృతమై పోయింది.

ఆస్తి అంతస్తుల్లో పోటీ పడలేకపోయినా కనీసం ప్రేమకోసం వున్న గడువులో ఇదన్నా సాధించాలి.

నానీ చూస్తున్నాడు తదేకంగా.

ఎందుకలా హైరాన పడిపోతున్నాడో అర్థం కావడంలేదు నానీకి. చివరికి ఆపుకోలేకపోయిన నానీ "ఏంటంకుల్ వెదుకుతున్నావు?" అన్నాడు.

"బ్రతికించే మందు" గొణిగాడు ఆ పదాన్ని మననం చేసుకుంటూనే.

అవును ఇన్ని నెలల తరవాత కలుసుకోబోతున్న తన ప్రియనేస్తం ప్రేమను శాశ్వతంగా బ్రతికించుకోవడానికిగాని, మందదే....

అప్పటికే పదిహేను నిముషాలు గడిచిపోయాయి.

రతి ఎలాంటి మొండిఘటమో తెలిసిన మన్మధరావు ఉరి తప్పించుకోటానికి అతి ముఖ్య మైన చివరి సాక్షికోసం ఎదురు చూస్తున్నట్లు కంపించి పోతూ ఏదో గుర్తుకురాగా వేగంగా బయటకి నడిచాడు.

ఆ వూరి స్కూల్లో పనిచేసే తెలుగు పండిట్‌ని కలుసుకుని అర్థమడిగాడు.

అతనూ తెలీదనగానే తొట్రుపడ్డాడు.

ఇంతకుమించి ఈ స్వల్ప వ్యవధిలో జవాబు తెలుసుకునే అవకాశం లేదు.

ఎందుకో గుండె లయతప్పినట్టు ఓ క్షణంపాటు స్థబ్దంగా నిలబడి పోయాడు.

అప్పటికి మిగిలింది మరో పావుగంట...

ఒక ప్రముఖ రచయిత అయినంత మాత్రాన భాష మొత్తాన్ని ఔపోపన పట్టి వుండాలన్న రూలేం లేదు.

అలాంటప్పుడు ఇంత క్లిష్టమైన సమస్య తనకెందుకు యిచ్చింది!

నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చిన మన్మధరావుని చూసిన నానీ "ఏంటంకుల్? నీకేమైంది?"

బయట అరుగుపై నిస్త్రాణగా చతికిలబడుతూ ఓ మంత్రంలా బయటకే అనేశాడు "అప్రశిఖ.."

"నీకు అర్థం తెలీదా" అన్నాడు నానీ మెల్లగా.

జవాబు లేదు.

"అసలు దానికి అర్థమే లేదుగా."

"అంటే?" ఈ పసివాడికి ఇదంతా ఎలా తెలుసన్న ఉద్విగ్నత మన్మధరావు కళ్లల్లో...

"ఒక శ్లోకంలోని నాలుగు పదాలలో మొదటి అక్షరాలు కలిపితే అప్రశిఖ వస్తుందని తాతయ్య చెప్పాడు."

"నానీ" ఏ దేవుడో కరుణించి పంపిన దూతలా అనిపించిన ఆ పసికందును అమాంతం దగ్గరకు లాక్కున్నాడు. "నీకు...నీకా శ్లోకం తెలుసా....?"

"ఓ!" జవాబు చెప్పాడు నానీ.

ఆప్పటికి మన్మధరావుకి మిగిలిన గడువు అయిదు నిముషాలు మాత్రమే వుంది.

** ** ** **

కోర్టు హాల్లోంచి బయటకి వచ్చాడు యశస్వి.

అతి ముఖ్యమైన సాక్షి అందుబాటులో లేనికారణంగా ఒక పది రోజులు గడువుకోరిన ప్రాసిక్యూటర్ అభ్యర్థన్ని అంగీకరించిన మేజిస్ట్రేట్ కేసు వాయిదా వేశాడు.

దీన్నొ విజయంగా భావించలేదు యశస్వి.